# కర్మఫలం

రాత్రి భోజనంచేసి వరండాలో పడకకుర్చీలో పడుకుని పెద్దచుట్ట వెలిగించాడు కృష్ణయ్య. దూరంగా వెన్నెట్లో కొండలమీద మంచు పాలిష్ వెండిమల్లే మెరుస్తోంది. వసంతరుతువు కావడంచేత చలి బాధించడంలేదు. అనుభవమంటే యీ మిలిటిరీ వాళ్ళది. ఆంజనేయులు ఇంకా క్లబ్బునుంచి రాలేదు. ఈవేళ అక్కడే భోజనం చేస్తాడు కాబోలు. ఆంజనేయులు పేరు ఇక్కడ మేజరుకుర్రు. అది తనపేరుకాదు. ఇంటిపేరూకాదూ, అతని తల్లిదికాదు. తల్లి ఇంటిపేరు ఎలకుర్రువారేమో! ఎలకుర్రువారు శూద్రుల్లో కూడా వున్నారా? ఇక్కడికి వచ్చింతరువాత కొత్త వుత్సాహమేకాదు, యవ్వనం కూడా వస్తున్నట్టుంది. అరవై ఎళ్ళకి తనకి! తనకి అలవాటు లేదుకాని, తాగాలంటే బోలెడు విస్కీ కూడాను.

పోయిన నెల యీపాటికి తనెక్కడ? ఎట్లా వున్నాడు? ఇట్లాంటి వెన్నెట్లోనే అరుగుమూల ఓ కుక్కి నులకమంచంమీద దగ్గుకుంటో! జాతకం తిరగడమంటే ఇట్లా మారాలి. బాధ అంటే మునలితనంలో అనుభవించిందే బాధ. వయసులో బాధని తట్టుకోగల శక్తి శరీరానికీ, మనసుకీ కూడా ఉంటుంది. తన వంతుకన్న ఎక్కువే అనుభవించాడు తాను-అయిదేళ్ళబట్టి.

తన పెన్షను పద్దెనిమిది రూపాయలు. కొడుకు మంచివాడే. కాని ఏంచేస్తాడు? పదేళ్ళలో ఆరుగురు పిల్లల్ని కన్నాడు. మొదట్లో వంశోద్ధారకులు మనమలూ, మనమరాళ్ళూ పుడుతున్నారని తాను సంతోషించాడు.

ఆ చంటిపిల్లలి ఆటలూ, మాటలూ, ఎంతో ఓదార్పుగా వుండేవి. తండ్రికి ఆఫీసూ, తల్లికి ఇంటిపనీ. తనకీవాళ్ళకీ తీరుబడి ఆడుకునేందుకు. తాతయ్యా! కథ చెప్పవా? అని దగ్గరచేరే గోపాలంగాడు ఏంచేస్తున్నాడో ఇప్పుడు? పాపం? ఆ చిట్టికి గోరింత దగ్గు రాత్రంతా. తాను ఎత్తుకుంటే దానికి కొంత ఓదార్పుగా వుండేది. ఇప్పుడెట్లావుందో? తనకోసం ఏడుస్తోందేమో ఎవరూ అడ్డంచెప్పేవారులేక తంతోవుంటుంది ఆ తల్లి. కట్నానికాశపడి ఆ చీకిరి పిల్లని కట్టపెట్టాడు తనే తన కొడుక్కి! తన నెత్తిమీదికే తెచ్చుకొన్నాడు. ఆ పీసపాటివారిపిల్ల ఐతే తనని మరీ అంత కాల్చుకు తిని వుండదు.

ఈ మిలిటరీ డాక్టరు ఇచ్చిన మందుతో తన దగ్గూ, తన తలతిప్పూ వారంరోజుల్లో మాయమైనాయి. మందుకి మూడణాలు లేవు పొమ్మంది తన కోడలు. తన సొంతకొడుకూ కోడలూకాక ముసలితనంలో ఈ ఆంజనేయులు తనకికావడం అదృష్టమేకాదు. చాలా ఆశ్చర్యమే. ఇతనికీ పెళ్ళి ఐతే ఇతనూ మారిపోతాడా? పూర్వం పెళ్ళితో మనుషులు ఇంతగా మారిపోయేవారుకారు. పెళ్ళి ఐతేనేం? బోలెడు జీతం. లెక్కలేని నౌకర్లు తనని మహారాజుని జూసినట్టు చూస్తున్నారు. కాని ఆంజనేయులికి తనమీద గౌరవమా? ఎంత అన్యాయం అతనికి తనమీద గౌరవం వుండడం? నిజం అతనికి తెలుసో? తెలీదో! అతనికి తెలీదనుకున్నప్పుడు తాను చాలా మోసగాడిమల్లే తనకే కనపడతాడు వెంకటప్పయ్య.

అతని వెనక ఎలెక్ట్రిక్ దీపాలు వెలుగుతున్నాయి. వాటి కాంతి ఒకవేపునా, వెన్నెలకాంతి ఒకవేపునా పడుతోంది తోటల్లో పామ్సుమీద. పక్కనవున్న ఉత్తరాది పర్వత పుష్పజాతినుంచి పరిమళం అల్లుకుంటోంది. తన చుట్ట పొగలని పీల్చుకుంటో. చాలా బావుంది చుట్ట. ఒక్కచుట్ట ఖరీదే రూపాయిన్నరట. ఇబ్బందల్లా చాపలూ, మాంసం వొండుతారు. తనకి కూరగాయిలే చేస్తారుగాని సయించవు ఆ వంటలు. అలవాటు చేసుకోవాలి

రెండుపూటా కోడలుచేసే కందిపచ్చడిపొడి మెతుకులకన్న నయంకదూ! ఎంతదయ అంజనేయులకి తనపైన? ప్రత్యేకం తెలుగువంటలు తనకి తెలిసినంతవరకు నేర్పుతున్నాడు బట్లరికి. చిన్నతనంలో పేదరికంలో తల్లికి వంటచేసి పెట్టేవాట్ట. తనకి తెలీనేతెలీదు. ఆ దాసీమనిషి కొడుకు ఈనాడు ఎంతవాడైనాడు! అది బతికివుంటే ఈనాడు? దానికిలేదు. తనకి పట్టింది ఈ అదృష్టం. చాలా హాయిగా వుంది జీవితం.

క్రమంగా అతని ఆలోచన ముప్పైయేళ్ళ వెనక్కి వెళ్ళింది.

గుమాస్తాపనీ. భార్య, పిల్లలూ, ఇట్లా అందరి గుమాస్తాల జీవితాల మల్లే కాకుండా, తనకి ఓమార్పు పట్టడానికి పీసపాటివారి ఇంట్లో భోజనం కారణం ఎంత స్వల్పవిషయాలు ఎంత గొప్ప దీర్ఘమైన మార్పులకి కారణాలవుతాయో! ముప్పైయేళ్ళకింద ఆ రాత్రి జరిగిన సంఘటన యీనాడు, తనని యీ వుత్తరదేశంలో హిమాలయాల మధ్య మిలిటరీ కటోన్‌మెంటుకి తీసుకొచ్చింది. ఆ భోజనం, భోజనంలో పచ్చకర్పూరం, జాజికాయవేసిన హల్వా, వొడ్డించిన వితంతువు వొంటిమీద పరిమళం, వడ్డించడానికి ఆమె వంగినప్పుడు అప్రయత్నంగా తానుచూచిన అందం, తన భార్య అందవికారంతో పోల్చుకోవడం, తాంబూలాలప్పుడు తనని మామూలు లెక్కలేని గుమాస్తాకిందగాక ప్రత్యేకించి ఆ ఇంటి యజమాని గౌరవించి గొప్పచేసి మాట్లాడడం. మునిసిపల్ మేనేజరికి పరిచయం చెయ్యడం. ఆయన ఇంకా జిడ్డుగావున్న తనచేతిని వొదలకమాట్లాడడం. తోవలో ఫాల్గుణ మాసపు వెన్నెతలా, ఇవన్నీ కలసి తనమీద తనకి ఉన్న అభిప్రాయాన్ని ఉబ్బించి, తన మామూలు సంసారంపైన అసహ్యం కలిగించి కొంత ధీరుణ్ణి చేశాయి ఆ రాత్రికి. తోవలో వాస్తో మిత్రులతో రెండు మూడు బూతులుకూడా మాట్లాడాడు ఎన్నడులేనిది.

ఆ రాత్రి చాలా స్పష్టంగా గుర్తువస్తోంది చిన్నచిన్న డిటెయిల్సుతో సహా. ఇన్నేళ్ళూ సరిగా ఒక్కసారికూడా తలుచుకోలేదు ఆ అసలు రాత్రి

సంగతి. మనసు హాయిగా విశ్రాంతిగావుంటే చక్కగా జ్ఞాపకం వస్తాయి పాతసంగతులు. దూరాన్నుంచి ఇంగ్లీషు ఆర్కెస్ట్రా వినబడుతోంది. చంద్రుడు కొంచెం ఎత్తుకిపాకి కొండలమీద మెరుగుల్ని కొత్తఛాయలతో దిద్దుతున్నాడు.

ముప్పై ఏళ్ళక్రిందట ఆ రాత్రి ఇంటికి చేరుకునేప్పటికి తన చిన్న వరండా అంతా పెద్దలైట్లతో వెలిగించినట్టు నిండిపోయింది వెన్నెల. ఉత్తరియ్యం బుజంమీదనించి తీస్తోవుంటే గంగా సెంటు పరిమళం. వెంటనే పక్కవాళ్ళ దొడ్లోంచి రేరాణి గుమాళింపు. గదిలోకి పోవడానికి బుద్ధి వెయ్యక అక్కడే నుంచుని నల్లని చెట్లకేసీ, వాటి మధ్య నించి కనబడే రోడ్డుకేసీ, సముద్రంవంటి ఆకాశం కేసి చూస్తోవుంటే ఏదో ఆరాటం కలిగింది. ఏదో కొత్తలోకం ఉన్నట్టూ, అది ఎట్టాగో అందుకోడానికి వీలున్నట్టూ అనిపించింది. అట్లాంటి అవ్యక్తాన్వేషణ ఫలితం ఇట్లా జరిగింది ఎందుకో మనుష్య ప్రయత్నాలు ఇట్లా ఫలిస్తాయి మనసులో. ఏదో విశాలమైన ఊహ, దాని ఫలితంగా చేరింది ఒంటి ఇరుకులోకి, ఆ వూహ కిందికి దిగి, రూపంమారి.

భోజనం, తాంబూలం. పక్కా, భార్యా ఇట్లా వరసగా జరిగిపోతోంది ఎన్నేళ్ళనుంచో ఈనాడు ఏమిటి ఈ కలవరం? గది, మంచం, అనేటప్పటికి ఆ వెన్నెల అభ్యంతరంగా ఎందుకు తెరకట్టాలి ఆ రాత్రి మాత్రం? తనని ఎంతో మోనంలో ముంచి తాను మామూలు గుమాస్తా కాదని నమ్మించి, మామూలు అనే దానినించి మెత్తని చేతులతో పిలిచి, ఎంత గొప్ప అపాయంలోకి ఆ వెన్నెల దింపతలచుకుంనో తాను తెలుసుకోలేదు. తన ఆనందం, ఆరాటం ఎవరితోనన్నా చెప్పుకోవాలి. ఏదో ఎట్లాగో ఆ క్షణాల్ని వ్యక్తపరచుకోవాలి. సార్థకం చేసుకోవాలి. ఒకరాత్రి తాను మామూలు గుమాస్తా కాకుండా పోయినాననే జ్ఞానకాన్ని శాశ్వతం చేసుకోవాలని అనిపించి వుంటుంది- అని ఈనాడు అనుకుంటున్నాడు. కాని

ఆనాడు మరి తన మనోస్థితిబాధో, సుఖమో మొత్తానికి ఏదో అసాధారణ మైన స్థితిని అనుభవించాడు.

ఎవరు! ఎవరు ఆ రాత్రికి తనకి? ఆ గదిలో మంచంమీద పడుకొని పిల్లవాడినోట్లో నమలపెట్టుతూ నిద్రపోతున్న తన సహధర్మచారిణి తోనా? ఈవేళప్పుడు ఆమెతో చెప్పుకునే విధం ఒకటే. తన అడుగుల చప్పుడు కాగానే శరీరాన్నీ, మనసునీకూడానేమో, మరి-తాను దగ్గిర చేరక ముందే ?ర్పించుకొని సిద్ధంగా వుంటుంది. మొక్కు తీర్చెయ్యడానికి.

కాని ఈ రాత్రీ అంతేనా?

బోగంవాళ్ళ ఇంటికిపోతే డబ్బు! పైగా చాలా పొద్దుపోయింది. ముందే ఏర్పాటు చేసుకోవాలంటారు. పైగా ఆ ఇళ్ళు ఏవో తెలీవు తనకి. చదువుకునే రోజుల్లో తనకి తటస్థించిన ఒక్కరొమాన్సు జ్ఞాపకం వచ్చింది. ఏమయిందో ఆమె! ఈరాత్రి ఏం చేస్తోవుంటుందో!

ఏం లాభంలేదు. పోయి పడుకొని వెన్నెలని మరచిపోవడం వొక్కటే మార్గం. అలిసి నిద్రపోవడానికీ సాధనం సిద్ధంగావుంది పక్కమీద, ఒక్క నిమిషంలో అవ్యక్తమైన అశాంతినీ, రొమాన్సునీ దిగమింగ గల యంత్రం. కాని ఆ రాత్రికూడా అంతేనా? అట్లా అనిపించడంలో మోసం ఈనాడు కనబడుతోంది, ఆనాడు కనపడలేదు. ఆనాడు తనలో ఏదో శక్తి, ఆశుకవిత్వం, విశాలత్వం అంతా చాలా నిర్మలంగా ఏదో ఆకాశం లోంచి వస్తున్నట్టేవుంది. కాని ఆ గొప్ప ఆరాటం ఫలితం ఇన్నేళ్ళభయం, బాధ, చౌర్యం! ఎందుకో అట్లా! ఎక్కడ వుంది ఆ లోపం? పాపం? మనసులో ఉన్నంతసేపు నిర్మలమే. అక్కడే ఆగాలిగావును! ఆ ఆరాటానికి రూపాన్నిస్తే ఘోరమౌతుందిగావును! కాదు తనకే. ధనవంతులకీ, అదృష్టవంతులకీ సరిగానే జరుగుతుంది. బీదవాళ్ళకి, గుమాస్తాలకే వెన్నెలలో కులకడానికీ, ఆరాటపడడానికీ, ఆశపడడానికీ యోగ్యతలేదు. మళ్ళీ కటికి బీదవాళ్ళకికూడా స్వేచ్ఛే. మరి అంతరం, అధికారం లేని పనులకి

పూనుకుంటే అట్లాగే అవుతుంది. వడుసు మరచి డాబామీదినుంచి దూకితే పర్యవసానం అంతే. కాని ధనవంతులు దూకగలరు: దూకి సమర్థించుకో గలరు. గుమస్తాగాడికి తనకి వెన్నెలతో ఏంపని! అందువల్లనే ఆ శాస్తి జరిగిందిగావును.

కాని ఎందుకో ఆ రాత్రి మాత్రం తనకన్న, రోడ్డుమీది కుక్క నయమనిపించింది అతనికి. ఆ గదిలో ఆ పక్కమీద ఆ పిల్లతో సహా అంతకన్న రోడ్డుమీద, బళ్ళసందుల్లో, అందరూ నవ్వుతో రాళ్ళు విసురుతో వున్నా కామించుకొనే కుక్కలు నయమనిపించాయి. దాన్ని లేపి వెన్నెల్లోకి రమ్మంటే. ఆ చీకట్లోంచి పక్కనవున్న వుల్లిపాయలబుట్ట వాసనలోంచి బైటకు రమ్మంటే, దోమల్లోంచి పిల్లబట్టల కంపులోంచి రమ్మంటే! నోట్లో పీక తీసేస్తే ఆ పిల్ల ఏడుస్తుంది. తన అర్ధాంగి తనకి పిచ్చి ఎత్తిందను కుంటుంది. అదిగాక ఆ వెలుతురులో ఆమెనిచూసి ఇంకా ఇష్టపడగలదా తను. ఆ పెద్దపొట్టా ఆదీ ఆ వెన్నెట్లో? ఏదో చీకట్లో వీలయిందిగాని అక్కడా! దానికి తనూ తనకు అదీ ఆ చీకట్లో వీలైనారుగాని వెలుతురులో చూసి ఎవరన్నా ఇష్టపడతారా తనుని! తమకన్నా హీనమైపోయిన మనుషులు తప్ప. ఎందుకో మనిషి శరీరం, ముఖ్యంగా స్త్రీ శరీరం అంత తొందరలో అట్లా వేళ్ళాడి పోతుంది!

గుడిశలలో బతికే బీదవాళ్ళమీద కనికరించి బోలెడు రాస్తారు. ఏమిటి తనబోటివాళ్ళ బతుకు! వాళ్ళకేం? ఆరోగ్యంగా ఏ గుడిశలముందో, పొలాల్లోనో పడుకుంటారు ఆ వెన్నెట్లో?

కాళ్ళు మామూలు అలవాటు ప్రకారం మంచాన్ని చేరుకొన్నాయి. పక్కన కూచుని మీద చెయ్యేశాడు. అదీ వాళ్ళకి గుర్తు. అన్నేళ్ళయినా తన స్నేహితులతో బూతులు మాట్లాడినా, ఆ విషయమై, తన భాగస్తురాలితో, ఒక్కమాట మాట్లాడలేదు. అంతే చెయ్యి వెయ్యడమే గుర్తు.

'వుండండి' అది విసుగుతో.

ఎప్పుడూ యిట్లా యెందుకో వుండండి అంటుంది. ఆ రాత్రి యెందుకో తన మనసు ప్రతిదీ యిట్లా ఆలోచించింది. ఏమిటా వుండండి? అంటే 'యీపాడుకార్యం ప్రారంభించేది మీరే; నా తప్పేం లేదు, యేదో ధర్మశాస్త్రాలు అట్లా విధిస్తున్నాయి గనక, నేను ఒప్పుకుంటున్నా'నని అర్థం గావును!

మామూలుగా పక్కన చేరాడు.

"నా ఒళ్ళు బాగాలేదు."

'ఏమీ!'

'ఒళ్ళు నెప్పులు, వుండండి.'

కాని ఆ మాటలకేం? లక్ష్యం చేస్తారా మొగాళ్ళు!

'ఒళ్ళు నెప్పులైతే! ఏమి?'

'నిజంగానే, చెప్పతూవుంటే!....ఏమిటండీ! చెవుతో వుంటే తెలీటంలా?....అరే మీకేం మతిపోయినట్టుందే!' చీదరించుకుంది.

చివుక్కుమని లేచిపోయి వెన్నెట్లో నుంచున్నాడు. విఫలమైనా, వుద్రేకం తగ్గలేదు. ఏం చెయ్యడం? దానికి చాలా పొగరుగా వుందే? తనని చీదరించుకుంటోంది. తనభర్తపి! వదిలితే యెట్లా? దాన్ని పట్టుకుని యిట్లా యీడ్చుకొచ్చి తన పంతం నెగ్గించుకుంటే? ఆ పిల్లో?

లోకమంతా వెన్నెట్లో వూగుతోంది. షర్టుకి అంటుకున్న అత్తరు పరిమళం మెదడువేపు పాకింది. కొబ్బరిచెట్టు గాలిలో తలవూయించింది. ఇంక ఆ యింటో నిలవలేదు. ఎక్కడికన్నా పోవాలి. ఏమిటీ అశాంతి? మెట్లుదిగి నడవాలోకి వెళ్ళాడు. మండువా పక్కన వెన్నెల తెల్లదుప్పటి మల్లే పరుచుకుంది, ఆ దుప్పటిమీద హాయిగా రాజి పడుకుని నిశ్చింతగా నిద్రపోతోంది. పక్కలేదు, దిండులేదు, వెన్నెలే దాని పాన్పు. పరుచుకున్న దాని రొమ్ములోకి వెన్నెల యింకుతోంది. నిద్రలో, దాని మొహం

లోని మొద్దుతనమూ, కళ్ళలోని జడత్వమూ, పెదవుల మీది కాపీనమూ కనపడలేదు. అదొక స్త్రీ విగ్రహం. హల్వా జనిత కామోద్రేక పరవశుడు అతడు. అక్కడో నిమిషం నించున్నాడు. అట్టే యోచించలేదు. అలవాటు చొప్పున యిటూ అటూ చూశాడు. రాజి పక్కగా కింద కూచున్నాడు. తను తాకగానే రాజి అరిస్తే? దగ్గిర ఎవరూలేరు మేలుకోడానికి. తను భోజనాలసావిడి చీకట్లలో మాయం కావచ్చు. రాజిని యెత్తి తన తొడమీద పడుకో పెట్టుకున్నాడు. ఆ వెన్నెట్లో, దాని చింపిరితల కానీ, దాని మురికి మెడగాని తనకి వికారాన్ని కలిగించలేదు. ఎంతసేపూ దాని రొమ్ముమీద యవ్వనాన్నే చూస్తున్నాయి కళ్లు. దాని తొడలవంపే పలకరిస్తోంది. పొట్టకి దానితలను అదుముకున్నప్పుడు కళ్లు తెరచి చూసింది. చిరునవ్వుతో దాని భయాన్ని పోగొట్టాలని చూశాడు. అతన్ని చూడగానే బెదిరి దూరంగా కూచుంది.

"అయ్యగారూ!"

"రాజీ!"

తన కంఠం విని ఆశ్చర్యంతో, కళ్ళలోని నిద్రని తోసేసుకుంటో చూసింది. ఎంత అవివేకి ఐతేనేం, మూర్ఖురాలైతేనేం, మురికిదైతేనేం? ఆ చూపు! యవ్వనంలో ఏ పని అందమనిపించదు! యవ్వనం, యావ్వనం పక్కనే అందమయినది. యవ్వనమే దేవతల్ని భూమికి ఆహ్వానిస్తుంది. ఆ చూపు, సమస్త దేహాల్నీ మురిపించింది.

"నీ కోసమే వచ్చాను"

అబద్ధం.

కాని ఆ అబద్ధం తన పెదిమలనించి రాజి చెవిని చేరేలోపల, దాంతో దోషాన్ని కరిగించేసింది వెన్నెల.

దాని దగ్గిరగా జరిగి, వీపు దువ్వుతో వెన్నెలకి పక్కగా నేలమీద పడుకోపెట్టాడు. పడుకుని రెండుచేతులతో కళ్ళు గట్టిగా మూసుకుంది.

నిశ్శబ్దం. అప్పుడప్పుడు రాజి రహస్యంగా "అయ్యగారూ," "అయ్యగారూ," అనడంతప్ప యింక యేమీ వినపడ్డంలేదు. చంద్రుడు మాత్రం మెల్లిగా జరిగి తనవంకచూసి, నవ్వుతున్నాడు. మనుష్య జీవితం! హా! హా! మనుష్యులు! అంటున్నట్టున్నాడు, చంద్రుడు.

ఈనాడు వెన్నెలముందు పడుకుని జ్ఞాపకం చేసుకుంటున్నాడు.

మిత్రుడు బాపయ్య అనే మాటలు జ్ఞాపకంవచ్చి చాలా ఆలోచనలో పడ్డాడు.

"ఒక పనిని చేశావా, ఒక పెద్ద గొలుసు, కార్యపరంపరని ఆకార్యాన్నించి, ఒకదానికొకటి పెనవేసుకొని వచ్చే ఫలితాలని ప్రారంభించావన్నమాట. చిత్రగుప్తుడు వుండనీ లేకపోనీ, యీ విశ్వఘటనలో, ఫలితాల్ని తప్పించుకోగల మనుకోడంకన్న మూర్ఖత్వం ఇంకేదీలేదు."

ఆనాడు ప్రారంభించాడు. ఒక నూతన ఘట్టాన్ని—తన అంతరాత్మ మెచ్చుకోని ఒక చరిత్రని ప్రారంభించాడు. పర్యవసానం?

ఆ రాత్రే, అప్పుడు నిశ్చయం చేసుకున్నాడు. అంతటితో యీ సంబంధం తుంచి వెయ్యాలని, ఇంక ఏ రాత్రీ యిట్లాంటి దుర్మార్గం తల పెట్టకూడదని, విధి తనకు వినబడకుండా పకాపకా ఆ రాత్రే నవ్వింది అనిపించింది ఈ రాత్రి.

మళ్ళీ బాపయ్య మాట్లాడుతున్నాడు తన చెవికింద.

"పొరపాటున, లేక తాగి వొళ్ళుతెలీక, అజ్ఞానంలో, ఎట్లానన్నా సరే ఏమన్నా చేశావా, మళ్ళీ కాలాన్ని ఎట్లా వెనక్కి పిలవలేవో, అట్లానే ఆకార్యాన్ని వెనక్కి పిలవలేవు. ఇంకెన్నడూ చెయ్యనని యేడవవచ్చు. నిజంగా చెయ్యకండానే వుండవచ్చు. కాని విధి క్షమించదు. క్షమించే శక్తి యీశ్వరుడికి కూడాలేదు. ప్రార్థనలూ, పశ్చాత్తాపాలూ, లంచాలూ, పూజలూ, అన్నీ వుత్తభ్రమ. తప్పించుకోడానికి వీలవుతుందని నిన్ను నువ్వు చేసుకునే మోసపు యత్నాలు."

బాపయ్య మెట్టవేదాంతానికేంగాని, ఐనా తాను చేసిన ఘోరకార్యమేమిటి? తన భార్యతో బదులు, రాజితో గడిపాడు. భార్యతో ఏ కార్యం అసహ్యమో, అదే రాజితో చాలసుందరంగా గడిపాడు. "చలం" ఏమీ పాపం కాదన్నాడు. నిజమే తాను రాకపోతే యింకోరు ఎప్పుడో ఒకప్పుడు రాజికి ఆ అనుభవం తప్పదుకదా! అట్లాంటి నీతిలేనిదానికి....నీతిలేనిదా? అవును. నీతిలేనిదే, కాకపోతే ఎందుకట్లా వూరుకుంటుంది? అవును, తాను కాకపోతే యింకోరు ఎవరైతేనేం? పోనీ దానికి పెళ్ళి ఐ భర్తే ఆమెని కావిలించుకుంటే? భర్త ఐతేనేం, అంతా ఒకటే చివరికి!

ఐనా తననే మొదలూ, కాదు. ఆదే నిజంగా కన్య ఐతే అట్లా వూరుకోదు. వొప్పుకోదు.

ఏమైతేనేం? ఇంక అటుపోకూడదు. దాని వంశం, కులం, ఎక్కడ? తన హోదా ఎక్కడ! దానికి చవకైపోతాను, అనుకుంటో నిద్రపోయినాడు ఆనాడు.

పొద్దున్నే మొహం కడుక్కోడానికి నీళ్ళిచ్చేప్పుడు రాజి మొహం చూడడం సిగ్గేసింది,కాని రాజి యేమీ జరగనట్టే మామూలుగాతిరుగుతోంది. తన సందేహం మరింత బలపడింది. తనేమీ దాన్ని అన్యాయం చెయ్యలేదు. అనుభవం దానికి కొత్తకాదు.

తరువాత రాజిని అట్టే తలుచుకోలేదు.

ఆ రోజు మధ్యాహ్నం భారతిలో వరలక్ష్మమ్మగారి కథ చదువుతున్నాడు. చదువుతోవుంటే తటాలున యేమిటి యీ నీతి బతుకు ? పరలోకం సంగతి యేమైతేనేంగాని, యీ లోకంలో సరదాగా వుండాలి అనిపించింది మనోనిశ్చయం చలించింది. పోనీ సిగరెట్టన్నా వెలిగించి కొంచెం అవినీతిని అవలంబిద్దా మనుకుంటే, అగ్గిపెట్టె కనపళ్ళేదు. కిందికి కేకేశాడు. రాజి మేడపైకి అగ్గిపెటె తెచ్చి ఇచ్చింది. రాజి మొహంవంక

చూశాడు. ఏమీ ఒక్క ఎమోషన్ (Emotion) కూడా లేదు. రాతిలో నిశ్చలమైన రూపుపెట్టి చెక్కినట్టుంది. పగలు వెలుతురులో ఏ ప్రయత్నమూ చెయ్యలేకపోయినాడు, సిగ్గేసింది. రాజి వెళ్ళలేదు. ఫలహారంచేసి వొదిలిన బల్ల కేసి చూస్తోంది.

"అవును: ఆ గిన్నెలు తీసుకుపో" అన్నాడు.

తీసుకుని వెళుతోంది. చప్పున ఇంకో ఆలోచన తట్టింది.

"చూడు ఆ పళ్ళెంలో మిగిలినవి తిను."

పళ్ళెం చేత్తో తీసుకుని వెళ్ళక, అగకా, తటపటాయిస్తోంది.

"అవును, కిందికెడితే, అమ్మగారు తిననీరు. ఇక్కడే తిను" అన్నాడు.

తనముందు తినడానికి సిగ్గుపడుతోంది. కాయితం తీసుకొచ్చి అవి పొట్లంకట్టి చేతికిచ్చాడు, తీసుకుని అక్కడే నుంచుంది.

"సరే వెళ్ళు,"

తనకేసి కళ్ళెత్తి చూసింది. ఆ చూపు ఒక్క ఆడవాళ్ళకే చాతనవును. ఆ చూపులో, యిష్టమూ, ఆశా, నిరాశా. జాలీ, అన్యాయారోపణా, అన్నీ కలిశాయి. ఒక్కరాత్రి ఆమెని కావిలించుకుని, మర్నాటినుంచి కొత్తవాడివలె ప్రవర్తించడం అన్యాయం. ఆమె బుజంమీద చెయ్యేశాడు. ఆమె అతని రొమ్ముమీద తలపెట్టి, నడుముని పిచ్చి చేతులతో కావిలించుకుని వొదల్లేదు. బాపయ్య మాటలు నిజమైనాయి.

ఆ సాయింత్రం ఆఫీసు వరండాలో పేకాడుతో వుండగా గుండె ఝల్లుమన్నది. నిష్కారణంగా, ఏమిటి? రాజీ తనని ప్రేమిస్తోంది.

సెట్ మధ్యలో బల్లమీద ముక్కలు పారేసి ఫౌంటెన్ దగ్గిరగా కూచుని ఆలోచించాడు, ఆత్మపరీక్ష చేసుకున్నాడు, అతని సంతోషం తలుచుకుంటే అతనికే భయమేస్తోంది. తనకికూడా ప్రేమరావటం లేదుకద! లేదు. ఏదో అన్యాయం చేశాననే జాలే కాని. రాజి అతన్ని కోరితే ఎందుకా

సంతోషం? అతన్ని ఒక స్త్రీ ప్రేమిస్తోంది. చివరికీ అందవికారమైన మురికి రాజేకానీ! ఇంకో హృదయం అతన్ని కోరుతుంది. అదే అతని మొదటి అనుభవం. ఇంకో స్త్రీ ప్రేమను పొందడం ఎంతకాలం,ఎన్ని సంవత్సరాలు అతను నిష్ప్రయోజనంగా బతికాడు! కొత్త జ్ఞానేంద్రియం పొడమినట్లయింది, ప్రతిరాత్రి రాజి అతన్ని అంగీకరించినా. అతనికో అలవాటు కింద తయారైనా ఏమీ యిబ్బంది లేకపోను? కాని కావలసి రాజి అట్లా కావిలించుకున్నప్పుడు! వీపు వెనుక వెళ్ళు. శరీరం జలదరించింది. తాను ఇంకో మనిషికి కావలసి రావడమనే సాఫల్యాన్ని పొందాడు—లక్షలమంది ప్రజలకి ఎన్నడూ రాని సాఫల్యం.

ఓ రాత్రి నడవాలోకి వెడుతోవుంటే ఎవరని భార్యకేక వేసింది.

"నేనే?"

"ఎందుకు?"

సేమ్ ఓల్డులై (Same old lie) చెప్పి తప్పించుకు వెళ్ళాడు.

"ఏం? జబ్బుగా వుందా!" అంటోంది. హాలులో రాజి లేదు. మాయమయింది!

దొడ్డి, బావి పక్కన, పశువుల పాకదాకా వెతికాడు, ఎక్కడికన్నా వెళ్ళిందిగావును? ఎవరు? పాలుపితికే కుర్రాడా? హృదయం భగ్గుమంది. కాని దొడ్డితలుపు లోపలగడియ వేసివుంది. ఎట్లా బైటికి వెళుతుంది? వివేకం నశించింది. రాజిమీద ఆగ్రహం వొక్కటే నడుపుతోంది తన చర్యల్ని. అవును, యీ రాజికి దడుపు పెట్టించాలి. ఏడిపించాలి. ఒక్క నిమిషంలో రాజి గర్భశత్రువయింది. వెళ్ళేప్పుడు ఎప్పుడు కావలించుకుందామా అనేటంత మోహం, ఎట్లా వోదారుద్దామా అన్నంతజాలి, వెనక్కి వొచ్చేప్పుడు, ఎట్లా బాధిద్దామా, ఎంత క్రూరంగా హింసించగలనా అనేటంత క్రోధం!

"రాజీ కనపడదే! ఏమయింది?"

నాలిక కొరుక్కున్నాడు

"కాదు తలుపులు తీసి వెళ్ళిపోయిందేమోనని"

"ఎక్కడికి పోతుంది అది?"

"ఏమో? ఏ కుర్రాడికోసమో!"

బాగా అనుమానాలు రేపి, దానికి చిక్కులు తెచ్చి పెట్టాలి.

"మరి తలుపులు గడియలు చూడకపోయినారా?"

"బాగా చూడండి"

ఆస్తి పోతుందంటే ప్రాణం నిలుస్తుందా?

"అయినా, దానికి అదుపూ ఆజ్ఞాలేకండా వుంది"

అంటో వెళ్ళాడు.

ఈసారి జాగ్రత్తగా పరిశీలించాడు

"రాజీ! రాజీ!"

"ఊ!"

నిమ్మ చెట్టుకింద కూచుని వుంది. వొక్కత్తె చీకట్లో.

చీకట్లో మొగాడికోసం వెతికాయి అతని కళ్ళు.

"ఏం చేస్తున్నావు యిక్కడ?"

ఏడ్చింది.

ఇదో వేషం!

"ఎందు ఏడుస్తావు?"

"ఎందుకట్లా కోపగించుకుంటారు?"

"మరి నువ్వు కనపడకపోతే?"

"నేను కనపడలా మీకు! నే నెందుకు?"

భుజంమీద చెయ్యి వేసింది.

"మ-మరి....అవును. నువ్వు కనపడకపోతే యెట్లా!" అంతకన్నా కవిత్వం రాదు అతనికి—గుమాస్తా!

"ఎప్పుడూ కనపడతాను. నా జన్మ అంతా మీకే కనపడతాను"

ఆ మాటలు ఎంత ధీరుడికికూడా భయం కలిగిస్తాయి. స్త్రీ మోహా భారంతో, పురుషుడి మెళ్లో వేళ్ళాడడం మొదలు పెట్టిందా ఇంక వొదల్చుకో లేని భారం. కాని ఆ నిమషాన అతనికి వాటిల్లోని అమృతమే తోచింది.

"కనపడ్డదా?" అని లోపల్నించి అతని భార్య.

"ఆ. వస్తున్నాను........

"ఏం చేస్తున్నావు ఈ చెట్టుకింద?"

"మిమ్మల్ని తలుచుకుంటున్నాను."

అంతకన్న కవిత్వంలేదు రాజిలో. పనిమనిషి!

దొడ్డి, నక్షత్రాలు, నిమ్మచెట్టు, అర్ధరాత్రి తనని తలుచుకోడం. ధారా నగరపు కాళిదాసా, నండూరి సుబ్బారావా? ఎవరికి అపీల్ చేసుకోలేను?

"కానీ రాజీ, నువ్వు కొంచెం శుభ్రంగా యెందుకు వుండవూ ? నీ జుట్టూ, పళ్ళూ, బట్టలూ, మెడా....ఆ వస్తున్నా. వస్తున్నా."

మర్నాడు సాయంత్రం కింద సావిట్లో తన భార్య పెట్టే కేకలూ, చివాట్లూ వినబడుతున్నాయి, రాజిని లాగుంది. కిందికి వెళ్ళాడు.

"చూశారా! మీరు చెప్పిన మాట నిజమే! చూడండి యిది...."

రాజివంక చూశాడు,

మొహానికీ, మెడకీ, తెల్లగా సబ్బునురుగుతో నుంచుని మొహంతో చూస్తోంది.

"మన సబ్బు రుద్దుకుంటోంది. దీనికి సబ్బెందుకో? దీని మొహానికి! సబ్బు కావాలిటే నీకు! అట్లా చూస్తో నుంచుంటారేం! రెండు వెయ్యక!.... కడుగు, కడుగు ముందు........" అంటో ఒక చెంబెడు చన్నీళ్ళు రాజి నెత్తిన పోసింది.

"అవును మీరు చెప్పినమాట నిజం. దీనికి బాగా తన్నులు కావాలి"

అప్పుడు రాజి తనవంక చూసినచూపు! "వెళ్ళు, వెళ్ళి తుడుచుకో." అని తన భార్య చేతుల్లోంచి రాజిని నెట్టగలిగాడు. అంతకన్న, యేమీ చాత కాలేదు ఆ మొగాడికి! ఏ మొగాడు మాత్రం యేం చేస్తాడు? పైగా యేదో మొగాళ్ళు ఆడవాళ్ళమీద నిరంకుశత్వం చూపుతున్నారంటారు: వాడెవడో ఆ బూతు కథలు రాసేవాడు!

సాయంత్రం బజారుకివెళ్ళి ఒక సబ్బు, కొంచెం కొబ్బరి నూనె కొని, కోటు జేబులో పెట్టుకొని వచ్చాడు. దొంగతనం ప్రారంభించినప్పుడు ప్రపంచమంతా అనుమానిస్తున్నట్టుగానే తోస్తుంది. కోటు వేసుకున్నావేమని అతని భార్య అడుగుతుందనీ, జేబులు తడుముతుందనీ భయం. ఆ బుడ్డిని, సబ్బుని. పశువుల పాక చూరులో పెట్టాడు.

రాత్రి రాజి మధ్యాహ్నం సంగతి యేమీ మాట్లాడలేదు, కొంత కోపం, రోషం చూపినా బావుండును. లేక సమాధానం అడిగినా బావుం డును. అతన్ని అనుకుని అతనివంక చూస్తో నుంచుంది. తానే క్షమాపణ అడిగితేనే కాని అసలు దానికి తన అపచారం అర్థం చేసుకునే తెలివే లేదేమో. తనెందుకు గోలపడడం?

"మరి నేనివి యెక్కడ దాచుకోను?"

"ఆ చూరులోనే వుంచుకో."

"అమ్మగారు చూడరా?"

"అక్కడికి యెందుకు వస్తారు?"

"మరి యెప్పుడు రుద్దుకోను?"

"రాత్రి అందరూ పడుకున్న తరవాత...."

"మరి....నేను శుభ్రమైతే...."

"ఐతే.."

"మరి, మీకు నా మీద యిష్టం యెక్కువవుతుందా?"

"ఇప్పుడు లేదా, రాజీ!"

.... .... .... ....

"రాజీ, ఆ చీర, బట్టలూ, దూరాన పడెయ్యాలి."

"బట్టలు లేకుండానా....ఛీ!"

ఒప్పుకోదు.

"మరి వాసన!"

బిత్తరపోయి చూస్తోంది. రాజి కళ్ళు చిన్నవి. అతనికి బాగుండ డానికి పెద్దవి చేసుకోమంటే యెట్లా వుంటుందో! బట్టల వాసన అని కంప్లెయిన్ చేస్తే అట్లా వుంది. తనేం చెయ్యగలదు? మొదట్లో ఏ వాసనా వెయ్యలేదు.

ఆటు తరువాత పదిరోజుల్లోనే రాజి ప్రేమని తలుచుకుంటే భయం పట్టుకుంది. ఆ పిల్లకేదో వెర్రిపుట్టిందనిపించింది. అతను ఎప్పుడు ఏ నిమి షాన వొంటరిగా దొరుకుతాడా అని కాచుకుని వుండేది. సిగ్గూ శీలం అన్నీ వొదిలింది. ఎక్కడ బైటపడుతుందో అనే భయమేకాక, ఆ పిల్ల ఆతృతనీ కామపరత్వాన్నీ, కాంక్షనీచూసి అసహ్యం కలిగింది. బైటపడితే అప్రతిష్టా, భార్య గొడవకాక, అసలు అట్లాంటి పిల్లతో సంబంధంలోని న్యూనత, కులం, సంస్కారం, నాగరికతా భేదం. కానీ ఇప్పుడు తలుచుకుంటే, అత నికి రాజి అట్లా కావటం చాలా సహజమనిపించింది. కన్య నవయవ్వనాన్ని రగిల్చిన పురుషుడిమీద తప్పకండా అల్లుకుంటుంది ఆమె హృదయం. అదేగా, కుటుంబాల్లోని ప్రేమ. పాపం, తనే పురుషుడు, భర్త, రాజికి ఆనాడు తనూ తన భయాలలో పడి కొట్టుకుంటున్నాడు. అసలు తాను చేసింది ఘోరమైన అన్యాయం. దాని ఫలితం అంతకన్న అందంగా జర గదు. తాను అసహ్యపడడంకూడా చాలా సహజం. ఏమైతేనేం, రాత్రులు తను రాజి దగ్గిరికి వెడుతున్నా, రాజి గ్రహించిందిగావును తన లోపలి విముఖత్వం. తను కినపడ్డప్పుడల్లా ఒకటే ఏడుస్తుంది. ఆ ఏడుపుతో తన

అసహ్యం మరీ హెచ్చింది. ఇంటి పనులమీద అశ్రద్ధ చూపడంవల్ల రాజికి చివాట్లు ఎక్కువవుతున్నాయి. "ఎందుకే పొద్దస్తమానం ఆ ఏడుపూ నువ్వూను! ఆ వెధవ మొహం నాకు కనపరచకు" అనే ఈసడింపులే కాదు. మొట్టికాయలుకూడాను. అవన్నీ భరించాల్సి వొచ్చింది తను చూస్తో, నిస్సహాయుడై. తనకోసం రాజి చేసుకునే శుభ్రాలుకూడా వెక్కిరింపులకీ, చివాట్లకీ ఆస్కారమైనాయి. అట్లాంటప్పుడు అతనికి చాలా జాలివేసేది.

మరి అతని భార్య ఏమన్నా చూసిందో, అనుమానపడిందో, కాక ఏమీ లేకండానేనో, రాజి రాత్రుళ్లు తమ ఇంటిదగ్గర పడుకోడం అవసరం లేదంది అతని భార్య. రాజి తన తల్లి ఇంటికి వెళ్ళిపోతోంది రాత్రులు. దాంతో అతని మనసుకి చాలా విశ్రాంతి కలిగింది. భార్యపైన కృతజ్ఞత కూడా వొచ్చింది. ఇంక ఆ రాజి తనకి కనపడకండాపోతేకూడా బావుండును" అనుకున్నాడు.

చంద్రుడు కనపడకంతా వెళ్ళిపోయినాడు పైకి. మంచు కొండలు మెరవడంలేదు. బంగళాకి దగ్గిరిగా ఎలుగ్గొడ్డుగావును గొంద్రు గొంద్రుమంటో అరుస్తోంది. నలుగురు స్నేహితులతో కలిసి నవ్వుకుంటో వచ్చాడు ఆంజనేయులు. కదలకండా పడుకున్నాడు, ఎక్కడ వాళ్ళు వచ్చి తన స్మృతుల్ని భంగపరుస్తారో అని.

.... .... .... ....

వారం రోజులయిం తరవాత రాజి అతనిని ఆఫీసునుంచి వచ్చేప్పుడు తోవలో సాయంకాలాలు కలుసుకునేది, ఎట్లాగో పనిలోంచి తప్పించుకుని వచ్చి, ఒకొ్కక్కప్పుడు కన్నీళ్ళతో నిలబడివుండేది మాట్లాడకండా, రోడ్డుపక్కన రొట్టెల దుకాణం ముందు, ఆ నల్లటి మురుగు కాలవ పక్కన. ఒకొ్కక్కప్పుడు దగ్గిరిగావచ్చి. "ఏం చెయ్యను? ఎట్లా?" అనేది.

ఒకొ్కక్కసారి తనకే దిగులు కలిగేదిగాని, చాలాసార్లు "ఇంక వదలిపోరాదా?" అనిపించింది.

నెలరోజుల తరవాతగావును రాజి పనిలోకి రాలేదు. తనకి ఆదుర్దాగానే వుంది. ఇంటిపనికీ ఇబ్బందే. అందుకని సాయింత్రం ఆ గుడిశల దగ్గిరికివెళ్ళి రాజి ఇల్లుకోసం విచారించాడు. రాజి తల్లీ, ఇంకో అతను మేనమామట, ఇద్దరూ వున్నారు. తల్లి చాలా దిగులుగా వుంది.

"రాజికోసమేనా అయ్యా! దాని ఒంటో బావుండటం లేదు." అంది.

"ఏదీ? ఎక్కడ వుంది?" అన్నాడు.

లోపలికివెళ్ళి రాజిని అతను చూస్తాడేమోనని భయపడ్డట్టు కనపడ్డది ఆమె.

"వస్తుందిలెండి. కొంచెం నయంకాగానే"అని అతన్ని పంపించేసింది.

మర్నాడు సాయంత్రం రాజితనని కలుసుకుని మధ్యదోవలో "అయ్యగారూ, బజారునిం....చా" అని బిగ్గిరిగా అని "అమ్మకి అంతా తెలిసిపోయింది" గొంతు తగ్గించి అని వెళ్ళిపోయింది.

తన కాళ్ళు వణికాయి. ఏం కాబోతుంది తన జీవితం?

తరవాత రెండురోజులు ఎంత బాధపడిపోయినాడో అతను! ఏ నిమషాన ఏం జరిగిందో, ఏం తెలిసిందో, ఏం చెప్పిందో, ఏం చేస్తుందో, అనే భయంతో. రాజిమీద కోపం. రాజి చెప్పింది ఎట్లా తెలుస్తుంది?

అనుకున్నంతా అయింది. ఆ ఉదయం తండ్రిగారి ఆబ్దికం. బ్రాహ్మడు రాలేదు, ఆలస్యం చేస్తున్నాడు. అఫీసుకు వెళ్ళాలి. రోడ్డుకేసి చూస్తో నుంచున్నారు తనూ, భార్యా, చిన్నకుర్రాడు ఆకలి అని ఏడుస్తున్నాడు. పెద్దపిల్ల వంటదగ్గిరవుంది. గుమ్మంలోంచి రాజీ, తల్లీ వచ్చారు. చప్పున కూలబడ్డాడు అతను గుండె ఆగినట్టయి.

రాజి తల్లి "అమ్మా, మీతో ఒక్కమాట చెప్పాలి. ఇట్లారండి" అంది.

అతని భార్య అదంతా వినిపించుకోక, "ఏమే. ఇదేనా పని! చెప్ప

కుండా మానేస్తే మేమే మవుతామనుకున్నావు? ఇవాళ తద్దినంకూడాను" అంటోంది.

"ఈ మాట వినండమ్మా, ఇట్లారండి" అంటోంది తల్లి.

రాజి కళ్ళు ఏడ్చి ఏడ్చి వాచినట్లున్నాయి. పక్క కొలుకుల్లోంచి తనని చూస్తోంది. వాళ్ళిద్దరూ వెళ్ళారు. రాజితో మాట్లాడదామంటే నోట మాట రాలేదు. ఇంతలో అత్ని భార్య కేకేస్తోంది. "ఇట్లా ఓసారి రండి" అని. లేవలేకపోయినాడు. నిందా పూర్వకంగా రాజివంక చూచి వెళ్ళాడు. ఆవాళ అబ్దికమన్నా ముగుస్తుందో! లేదో! దొడ్లో అత్ని భార్య "చూశారా, రాజి ఎంతపన్నా చేసిందో! కడుపుట! దానికి ఎట్లా వచ్చిందో చెప్పమంటే మాట్లాడదుట. మూడురోజులు తన్నినా నోరు మెదల్చదుట. మనింటోనే పడుకునేదా. మాయముండ ఎట్లామరి ఎవర్ని మరిగిందో! దాన్నిచూసి వలచిన ఆ వెధవెటువంటివాడో! మీరు అనుమానపడుతోనే వున్నారు."

అమ్మా! బతికిపోయినాడు. వెంటనే వెళ్ళి, రాజిని కావిలించుకోవా లనుకున్నాడు.

"ఏమంటుంది ఇప్పుడు?"

"ఏం చెయ్యనంటుంది?"

ఏం చెపుతాడు తను?

"పెళ్ళి చేసెయ్యవే ఎవడో ఒకడికిచ్చి వెంటనే" అంది భార్య.

అమ్మా ఈ ఆడవాళ్ళు ఎంత తెలివిగలవాళ్ళు!

"అవును. పెళ్ళి చెయ్యి."

"దమ్మిడీ లేనిముండని ఇంత తొరలో దీన్ని మొహాన్ని పెళ్ళి చేసుకునేందుకు ఎవడు వస్తాడు? ఓ అయిదువందలన్నా లేంది?"

"చూద్దాం, చూద్దాం. ఆలోచిస్తాను, రేపురా" అన్నాడు.

అన్నాడేగాని అయిదువందలుకాదు. యాభై రూపాయలు ఇవ్వ గలడా? తన ఆస్తిని అమ్ముతాడా రాజికోసం? రాజి తల్లి ఎన్నిసార్లు తిరి

గినా చల్లని మాటలు చెప్పి పంపించాడు. ఏం చేస్తాడు అతను అంతకన్న
పెద్ద కుటుంబీకుడు?

ఎట్లా కనిపెట్టిందో, రాజి అతను రహదారీ బంగళాలో కలక్టరు
సేవచేసి వస్తోవుండగా కలుసుకుంది. ఒకటే ఏడ్చింది. కాని రాజికి
మాత్రం తెలీదా తను ఏమీ చెయ్యలేడని! తన పేరు చెప్పవద్దని బతిమాలు
కున్నాడు. ఆ గొడవ ఏం పట్టినట్టులేదు, తన అపాయమూ, అపవాదు
ఏదీ పట్టలేదు మొస్టుకి. తనని కొడుతున్నారనీ, తిండికికూడా ఏమీలేదని
చెప్పుకుంది. తన జేబులోవున్న రూపాయిల్లో భద్రంగా తీసి ఓ అర్ధ
రూపాయి ఇచ్చాడు. ఏమన్నా కొనుక్కోమని. తనుచేసే సూడిదలను
కున్నాడు. కాని ఆ అర్ధరూపాయిమీదా లక్ష్యంలేదు ఆ పాతకికి, అతన్ని
ఆ చీకట్లో ఆ చెట్టుకింద గట్టిగా పట్టుకుంది. వొదలదు. వుద్దేశ్యం తెలు
స్తోనే వుంది. "నీకేం పిచ్చా!" అని విదిలించుకుని వెళ్ళిపోయినాడు. ఏమిటి
ఆ చెట్టుకింద! ఏమనుకుంది తనని? బజారుపోకిరీ వాడనుకుందా? తనతండ్రి
ఓవర్సీరు. మామగారు రిజిస్ట్రారు.

తరువాత రాజిగాని, తల్లిగాని, కనపడలేదు చాలా నెలలు. ఓ రాత్రి
రాజి తల్లి వచ్చి, తన కూతురుకన్నది: పాతచీరె ఏమన్నా ఇయ్యమనీ అడి
గింది. తన భార్య చాలా ఉదారంగా సగం కొత్త చీరె ఇచ్చింది కూడాను.
ఆటుతరువాత రెండునెలలకి తనకి ఇంకో కొడుకు పుట్టాడు. ఈనాడు తన
వూళ్ళో బతికివున్నది ఆ కొడుకే.

.... .... .... ....

చలి ప్రారంభించింది. పాపం ఆ నౌకరు తనకోసం మేలుకుని
అట్లానే కూచుని వున్నాడు. ఆ రాజి వెళ్ళిపోయింతరవాత తనకి అసలు
నౌకరంటే తెలీదు. తన జాతకానికి చాలా గొప్పదశ ఏదో పట్టివుండాలి.
ఇంక తనకి వాంఛించవలసింది ఏదీ కనపడదు.

.... .... .... ....

తరవాత నాలుగేళ్ళకి గావును తాను ఆఫీసునించి ఆలస్యంగా ఆకలితో వచ్చిన ఓ రాత్రి తన భార్య, "ఎవరు వచ్చారో చూడండి" అంది గర్వంగా, సంతోషంగా, వరండాలో లాంతరు వెలుతురులో చాపమీద కూచునివుంది ఒకామె. తన బంధువు లెవరూకాదు. ఎవరూ అట్లా తయారు కారు. చాలా కొత్త రుచులతో అలంకరించుకుంది. వంగపండు చాయ వెంకటగిరిచీరె ఆమె నల్లని వంటికి చాలా అందాన్నిచ్చింది. ఆ పట్టు జాకెట్టు, దానికింద కనపడే లోపలి బట్టలూ, ఆ జుట్టుముడీ, పువ్వులూ, చిన్నలోలాకులూ, ఎంతో అందమనిపించాయి అతనికి ఆమె పక్కన ఒక కుర్రాడు చక్కని క్రాపు, ముఖాన తెలివీ, తనవంక నిదానంగా చూస్తు న్నాడు. తనని చూసి ఆమె చప్పున లేచి నుంచుంది భక్తిగా, సిగ్గుగా.

"ఎవరో చెప్పుకోండి."

"తెలీదతనికి."

"మన రాజి"

"రాజీ! రాజే! నువ్వు రాజే."

"అవునండీ."

ఆ కంఠంలో తక్కువకులపు శబ్దంవల్ల గుర్తుపట్టగలిగాడు.

"ఎక్కణ్ణించి?"

"రంగం వెళ్ళిపోయినాను. మొన్ననే తిరిగి వచ్చాను."

"వాడు నీ కొడుకా?"

"ఊ"

"మీ అయనేం చేస్తున్నాడు?"

"రంగంలో మోటారు డ్రైవరు, ఈ వూరు తీసుకొచ్చాను. ఇక్కడి రాజాగారిదగ్గిర డ్రైవరు పని ఖాళీగా వుందన్నారుట. ప్రయత్నిస్తున్నారు"

"తెలుగు అతనేనా?"

"ఆ"

"ఇంక ఈ వూళ్లోనే వుంటారన్నమాట?"

"ఊఁ"

"ఎక్కడ ఉన్నారు?"

"మేదర పేటలో పచ్చడాబా లేదండీ. బాదం చెట్టు వెనక, అదీ అద్దెకి తీసుకున్నాం, పదిహేను రూపాయలకి."

"ఇప్పుడు మనకన్న రాజే భాగ్యవంతురాలు. బాగా సంపాయించా డుట, వాళ్ళ ఆయన చూశారా, ఆ నగలు! అంది సగం గర్వంగా, సగం దిగులుగా ఈర్ష్యగా అతని భార్య.

రాజి ఇల్లు తన ఆఫీసుతోవలోనే. బాదం చెట్టుక్రింద కుర్రాడితో ఆడుకుంటో కనబడుతోంది రాజి. తక్కిన గుమాస్తాలతో, మనుషులతో మాట్లాడుతో తలవంచుకు వెళ్ళిపోతున్నాడు.

ఆ కుర్రాడు తన కుర్రాడేనేమో!"

ఒకరోజు అతన్ని పిలిచింది.

"అయ్యగారూ, రండి....రండి....నన్ను ఎరగనట్టే వెళ్ళిపోతారేం? మా బోటివాళ్ళ ఇళ్ళకి వస్తారా?"

లోపల కుర్చీలు, పటాలు.

"రావడానికేం? మీ అయనకి ఇష్టం ఉంటుందో లేదో అని"

"ఆయన అలాంటివారు కారండోయ్! చాలా మంచివారు"

"ఉద్యోగం కుదిరిందా?"

"ఆ, కాని ఆయనకేం లెఖ్క! ఏదో ఉద్యోగం వుండాలని కాని!"

ఏమిటి ఇంతలో ఇట్లా మారింది! తన నౌకరు, తన వుంపుడుకత్తె, ఈరాజి!

సిగ్గుతో తన కుర్రాణ్ణి చూపింది.

"బాబాయిగారు. నమస్కారం పెట్టు."

"తరవాత పిల్లలులేరా నీకు?"

"ఎందుకులెండి....వీడువాలు....?" అని కంఠం తగ్గించి
"అన్నీ మీ పోలికలే." అంది కొంటెగా.

ఆ కుఱ్ఱాణ్ణి చూస్తే తనకేం ఇష్టంరాలేదు, ఏ శ్రీరాముడికో రావలిసిందేగాని అవ్యక్తంగా ప్రేమ! తన కుఱ్ఱాణ్ణి ఇంకోడు తండ్రిగా పెంచుతున్నాడంటే కోపంకూడా వస్తోంది.

వారానికి రెండు మూడురోజులన్నా వెడుతున్నాడు రాజి ఇంటికి. మెల్లగా రాజిని తలుచుకోడం ఎక్కువయింది. ఆ మాత్రం అందం తనకి అంత దగ్గరగా, చనువుగా లభించింది. అంతా పోషణలో వుంటుంది. ఎక్కడ దాసీపిల్ల రాజి, ఎక్కడ ఈ యువతి. ఎక్కడ పోలికన్నా లేదు కద! ఆ కుఱ్ఱాడు మెల్లిగా అలవాటవుతున్నాడు తనకి. తను అటు వెళ్ళేటప్పుడల్లా "బాబాయిగారు అమ్మా," అని కేకేస్తున్నాడు.

మరి ఆ సాయింత్రం ఎందువల్లనో చెప్పలేడు ఈనాడైనా సగం సగం చీకట్లో రాజిని కావిలించుకున్నాడు. మెల్లిగా పక్కగదిలోకి ఆమెను తను లాగుతున్నప్పుడు రాజి కదలలేదు. ఆమె వీపుని పట్టుకుని దగ్గరగా లాక్కుంటున్నాడతను. ఆమెలో చలనంలేదు.

"వద్దండీ" అంది."
"ఏమే, ఇంతలోనా."
"అట్లాంటివి మానేశాను."
ఆమె అయిష్టం అతనిని మరింత రేగకొడుతోంది.
తనకోసం ఒకటే తిరిగిన దిక్కుమాలినపిల్ల ఆ రాజి!
"సరేలే, కొత్తవాణ్ణి కానుగా?"
అని చేతులతో ఆమె ఒంటిని బాలా బలవంతం చేశాడు.

"వుండండి! వుండండి" అని తప్పించుకుని బైటవరండాలోకి వెళ్ళిపోయింది. ఏం చెయ్యాలో తెలీక, సిగ్గుపడి, తనమీద తాను అసహ్యపడి

కొంచెంసేపు అక్కడే నుంచుని, తిరిగి ఐనా చూడకండా. మాటలేకండా, వెళ్ళిపోయినాడు.

వొళ్ళు మండిపోతోంది. ఈ రాజీకి, వుత్తరంకు దానికి, ఎంత నీతి ఎక్కింది, డబ్బుతోపాటే! ఒక్కసారి పాత కథని ఆ మొగునికి వినిపిస్తే ఏమవుతుంది, దాని కులుకు? ఆ ఆలోచనల్లో మునిగి ఆనాడు తెలీనన్నా తెలీలేదు అతనికి.

ఆ రాత్రి తనబాధ ఈనాటికీ మరిచిపోలేదు. ఎంతరోషం, ఎంత సిగ్గు, ఎంత ఆగ్రహం. కాని ఏం చేస్తాడు! ఎప్పుడో వీలు చూసుకుని వెళ్ళి ఆమెని పశుబలాత్కారంతోనైనా అనుభవించాలని చాలా అనిపించింది. ఆ నిరాకరణతో రాజీ మూల్యం అతని మనసులో చాలా హెచ్చింది. కొన్నాళ్లు ఆ రోడ్డు తప్పించి వంకరదోవల వెళ్ళాడు ఆఫీసుకి. కాని ఆరాటం ఆగలేదు. రాజీ వప్పుకున్నవుంటే, తనకాలం ఎంత హాయిగా సాగిపొయ్యేది? అప్పుడప్పుడు రాజీ, కొడుకూ తనకి బజారులో ఎదురయ్యేవాడు. కాని, అతను మాట్లాడడు. అటు చూడడు. కుర్రాడు మాత్రం, "అమ్మా, బాబయ్యగారు!" అంటాడు.

ఓసారి మాత్రం రాజీ, "బాబయ్యగారికి మనమీద కోపం" అంది.

అంతే, అట్లా అక్కడక్కడ కనపడుతోనే కనపడడం మానేసింది. ఆ బాదంచెట్టు డాబా ఇంట్లోకి ఇంకెవరో అద్దెకివొచ్చారు.

తరువాత పదేళ్ళపైనగావును ఓనాటి ఉదయం రాజీ కనపడ్డది, అప్పటికి తనుకొంత ఉద్యోగస్థుడూ, ఆస్తిపరుడూ, ఐనాడు. అది గుమాస్తాల పంటకాలం. ఆఫీసులు బాగా పండుతున్నాయి. రెండు చేతులా డబ్బు కూడ పెట్టకపోతే, తనకీ ఇంకా పెద్ద ఉద్యోగ మయ్యేదే. పదేళ్ళు దాటినా రాజీ అట్లానే వుంది. ఆ కొడుకు మాత్రం బాగా ఎదిగాడు. రాజీ తనని యాచించ వొచ్చింది. భర్త ఆమెని వొదిలి రంగం పారిపోయినాడు. ఆమె కొడుకు చాలా తెలివిగలవాడు. ఇంటర్ మీడియేట్‌లో వున్నాడు. పదిహేను ఏళ్ళకే.

ఇంక చదివించడానికి డబ్బులేదు. తనేమైనా సహాయం చేస్తాడా? అప్పుకింద ఇస్తే తీర్చుకుంటాడు ఆ కొడుకు అంది.

తన అసలు కొడుకు ఇంకా మూడో ఫారంలోనే వున్నాడు. తన పిల్లలకి కాకండా ఈ కుర్రాడికి తన డబ్బు పెట్టుబడి పెట్టాలా? సిగ్గు లేకండా ఏమని అడగవొచ్చింది? ఆ కొడుకు ఎన్నడో ఉద్యోగంచేసి తీరుస్తాడా? తీర్చకపోతే? సరేలే, ఆలోచిస్తానని చెప్పి తప్పించుకున్నాడు ఆనాటికి.

ఓ వారం తరవాత గావును ఆఫీసుకి ఆ కుర్రాడు వచ్చి "బాబాయి గారూ! అమ్మ మిమ్మల్ని ఓసారి మా ఇంటికి రమ్మంది" అన్నాడు. ఆ సాయింత్రం చాలా స్పష్టంగా మాట్లాడింది రాజి.

"నా కుర్రాడికి నేను చదువు చెప్పించుకోగలను. నేను వప్పుకుంటే నన్నూ, వాణ్ణీ పోషించేవాళ్ళున్నారు. కాని ఏమిటో మిమ్మల్ని సహాయం అడగాలనిపించింది. మీ కొడుకేగద! కోపం పెట్టుకున్నా నామీద ఆనాటిది. మరి ఓ భర్తకు మనిషినయింతరవాత అట్లాంటిపని నాకు బావుండలేదు. కాని ఇప్పుడు మీ మనిషిగా వుంటాను. నన్నో భార్యకిందా, ఆ కుర్రాణ్ణి మీ కొడుకు కిందా చూసుకోండి" అని, "ఇది మీ యిల్లుగా చూసుకోండి" అంది.

ఆలోచిస్తానని చెప్పి బైటకి వొచ్చాడు. మళ్ళీ ఇప్పుడా, ఇన్నేళ్ళకా? తనకి ఆవాంఛ ఎక్కడవుంది ఇప్పుడు? దాని మొగుడు ఎందుకు వెళ్ళి పోయినాడు? ఏం చేసిందో! ఖర్చు తనదీ, రాజి వూరివాళ్ళదీనా? వీల్లేదు అని మళ్ళీ ఆవేపు పోలేదు తాను.

త్వరలోనే రాజి పేరు వింటున్నాడు తను, వూరి మొగాళ్ళనించి బాగా సంపాయిస్తోందని. రాజిని తనెన్నడూ మళ్ళీ చూడలేదు. వూళ్లోనే వుందని తెలుసు.

మళ్ళీ మూడేళ్ళకి కుర్రాడితో తన ఇంటికి వచ్చింది రాజి. బి. ఏ

అయినాడు ఆ కుర్రాడు. యుద్ధంలో చేరతానంటున్నాడు అతను. ఆ కుర్రాడికి అతని మాటమీద గౌరవమనిన్నీ, అతను యుద్ధంలో చేరకుండా సలహా ఇమ్మనీ వచ్చింది తన దగ్గిరికి. ఇంకా తనమీద గౌరవమా కుర్రాడికి ? ఎందుకు? ఇంకా రాజికి తన సలహా కావాలా? ఇదంతా ఏదో ఎత్తు. కాని యుద్ధంలో చేరమేడమే చాలా మంచిదని సలహా ఇచ్చాడు, వాళ్ళని వదిలించుకోవాలని. తన మాయమాటలు వింటో వుంటే ఆ కుర్రాడి మొహం ఎంతో కృతజ్ఞతతో నిండింది! చాలా బావున్నాడు, బలం, తెలివి, వర్చస్సు అన్నీ. గర్వంకూడా కలిగింది ఈనాడు, అట్లాంటి కుర్రాణ్ణి కన్నానని. వాడి ముందు తన సొంత కొడుకు, అర్భకుడు, మూఢుడూ, అల్పుడు.

తన ఆఫీసులోనే గుమస్తాపని ఖాళీగా వుంది. రాజి కొడుక్కి ఉద్యోగం ఇప్పిస్తే! అతని తెలివితో చురుకుతనంతో చాలా త్వరలో బ్రాహ్మణేతరుడు కావడంచేత, డిప్టీకలెక్ట రౌతాడని తెలుసు. కాని వాడికా? ఆ రాజి కొడుక్కా! తన సొంత కొడుకుని ఆ స్కూల్ ఫైనల్ — వాళ్ళ కాళ్ళు వీళ్ళ కాళ్ళు పట్టుకుని పైకి లాగించాడు. వాడిమీద వీడు అధికారా? వాణ్ని, వాడి తెలివినీ భరించలేడు తాను. వాణ్ణి పంపెయ్యాలి, యుద్ధానికి పోయి చచ్చినా తనకి కొంత బాధ తీరుతుంది. బోగం వృత్తిచేసి సంపాయించి చదివించినవాడికి అంత అదృష్టమా?

ఈనాడు హిమాలయాలముందు హాయిగా కుర్చీలో పడుకుని జ్ఞాపకాలు తెచ్చుకుంటో వుంటే, తానెంత దుర్మార్గంగా ప్రవర్తించిందీ కొంత కొంత అర్థమౌతోంది తనకి. తాను మొదట్లో రాజికి చేసిన అన్యాయం. తాను అన్యాయం చెయ్యకపోతే రాజి రంగం ఎందుకు పెడుతుంది? ఆ కొడుకెట్లా పుట్టేవాడు? తన కొడుకు కాకపోతే ఆ తెలివీ ఎట్లా వచ్చేది ? తన సొంత కొడుక్కి ఆ తెలివి ఎందుకు రాలేదా అని కాని? మరి తన సొంత తెలివి ఏమంత గొప్పదనికాని ఆలోచన ఈనాడు ఇంకా లేదు అతనికి. ఆ రాజి ఏ బండివాణ్ణో పెళ్ళిచేసుకుని బండీ వాళ్ళనే కనేది అనే అతని ఆలోచన.

మొత్తానికి అతన్ని యుద్ధానికి పంపేశాడు. తరవాత చాలా త్వరలో తన భార్య పోవడం, కొడుకు తనకివున్న చిన్న ఆస్తిని ఖర్చుచెయ్యడం, ఆ కొడుకూ కోడలూ తనని నిర్లక్ష్యంగా చూడడం జరిగాయి. ఈ లోపల రాజి అప్పుడప్పుడు తనని చూడ్డానికి వచ్చేది తన కొడుకునించి ఉత్తరాలూ, మిలిటరీ దుస్తుల్లో ఫోటోలూ గర్వంగా చూపించింది. అతను గొప్ప ఆఫీసర్ల కింద ప్రమోషన్లు పొందుతున్నాడుట.

తల్లికి నెలకి నూరు రూపాయలు పంపుతున్నాడు. ఇప్పుడామె సంపాయించవలసిన అవసరం లేదు. పైగా అతని దైన్యం చూసి అప్పుడప్పుడు ఓ పదిరూపాయలిచ్చేది. ఎట్లాగో పసిపట్టి కోడలు లాక్కునేది ఆ డబ్బు. ఎప్పుడు తనకొడుకు సంగతి మాట్లాడినా వాడు అతని కొడుకైనట్టే మాటాడేది రాజి. ఒకటి రెండుసార్లు అతనుకూడా తండ్రి అని సంబోధించి ఉత్తరాలు రాశాడు తనకి.

కలరా వొచ్చి రాజి హఠాత్తుగా చచ్చిపోయింది. ఆ సంగతి ఆంజనేయులకి అంటే కాప్టెన్ కుర్రకి, రాయగానే శలవమీద వచ్చాడు. అతని ఠీవీ, ధనమూ, చూడగానే తాను దిగ్భ్రమలో పడ్డాడు. మళ్ళీ ఓ రాత్రి వచ్చాడు తాను వెళ్ళిపోతున్నానని చెప్పడానికి. చలికాలం కప్పుకోడానికన్నా లేకండా వణుకుతున్నాడు తాను వరండాలో. నెలనెలా డబ్బు పంపుతానన్నాడు తనకి. తాను వప్పుకోలేదు.

"అవును అమ్మ రాసింది జ్ఞాపకం, మీకు డబ్బు ఇచ్చి లాభం లేదుటగా?" అన్నాడు.

తను సిగ్గుతో మాట్లాడలేదు.

"అట్లా కాదు. నాతో వచ్చేయండి" అన్నాడు. కాని తాను నిరాకరించాడు. అతను వెళ్ళిపోయినాడు. తరవాత మూడు నెలలకి జబ్బు చెయ్యడంతో తన సొంత కొడుకు, కోడలు ఔదార్యం బైటపడ్డది. కూతురుకి అదివరకే పెళ్ళి చేశాడు. ఇంకో కొడుకు చిన్నప్పుడే చచ్చిపోయినాడు. తనకింక ఎవరూ దిక్కులేరు.

ఆంజనేయులికి వస్తానని రాశాడు. వెంటనే టెలిగ్రాం మని ఆర్డరు వచ్చింది. జన్మలో అదే సెకండు క్లాసులో ప్రయాణం చెయ్యడం తను.

చంద్రుడు అస్తమించాడు నౌకర్లు నిద్రపోయినారు. తనకి తెలీకండానే చలికి ఒళ్ళు బిగుసుకుపోయింది.

చాలా విచిత్రంగా వుంది. ఇప్పుడిప్పుడే అర్థమౌతోంది ఆ గుమస్తాకి జీవితంలో లోతూ, ఐరనీ. ఏ న్యాయ ప్రకారంకూడా ఈ ఆంజనేయులుకి తనమీద ఇంత ఇష్టం రావడంలో అర్థంలేదు. తనని శిక్షించడానికే, తనని ఆదరిస్తున్నాడా? ఆ ఆదరణమే తన శిక్ష? కాదు. అతని గౌరవం నిష్కళంకం. అందుకనే అంత దుస్సహం. తనని మొదటినించీ తండ్రిగానే భావించుకుంటున్నాడు. అదంతా రాజి చేసినపని. చిన్నప్పటినించీ తననే అతని తండ్రిగా చూసుకోడం బోధించింది.

క్రమంగా రోజు రోజూ తెలుస్తోంది అతనికి తనెంత క్రూరంగా అన్యాయంగా, పిరికితనంగా ప్రవర్తించాడో రాజీ, రాజి కొడుకుమీదా. రాజే బతికి వుండి, అక్కడవుంటే బావుండేది; కాని రాజి ఇక్కడ కొడుకుతో వుంటే తాను వచ్చేవాడా!

ప్రొద్దుపోయింది. చలి, ఇంక పడుకోవాలి. అందరికీ తనని గొప్ప చేసి చూపుకుంటున్నాడు ఆంజనేయులు, తన తండ్రిగా—అతన్ని అంత వృద్ధిలోకి తెచ్చింది తానే ఐనట్టు. తనని ఒక గురువుగా చూస్తున్నారు అతని మిత్రులు. మరి దైవం ఏం తలిచాడో? తనుచేసిన ఘోరాన్ని క్షమించాడా? తన దౌర్బల్యాన్ని, దరిద్రాన్ని, అర్థం చేసుకుని నవ్వేశాడా దేవుడు? కర్మప్రకారం తను చాలా కష్టాల్ని అనుభవించాలి. తను చేసిన పాపాలకి. అవన్నీ వొచ్చే జన్మకి అట్టేపెట్టాడా దేవుడు! కాక దేవుడు శిక్షించే పద్ధతి ఇదా? ఈదయా?